క్లుప్తంగా

బీజేపీని గద్దె దించుతాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 8 వరకు సీపీఐ బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై పైశాచిక కృత్యాలు జరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, ఆంజనేయులు, నాగ సుబ్బారెడ్డి, వెంకట శివ, ఎంవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిలక్ పోరాటం నేటితరానికి స్ఫూర్తి

కడప కల్చరల్: స్వాతంత్ర్యం నా జన్మహక్కు అని బ్రిటీషు వారిపై పోరాటం చేసిన బాలగంగాధర్ తిలక్ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని మిత్ర యోగా కేంద్రం నిర్వాహకులు డాక్టర్ రంగనాథరెడ్డి అన్నారు. తిలక్ వర్ధంతి సందర్భంగా పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో సంస్థ వ్యవస్థాపక నిర్వాహకులు షేక్ మహ్మద్ రఫీ ఇతర అతిథులతో కలిసి తిలక్ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ తిలక్ సేవలు మరువలేమన్నారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలోని చిన్నారులకు బిస్కెట్లు, చాకెట్లు పంచి పెట్టారు.

పెండింగ్ వేతనాలను అందించాలి

కడప ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

దొరల గోరీలను పరిరక్షించాలి



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రం సమర్పిస్తున్న క్రిష్టియన్ మైనార్టీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరం మాసాపేటలో ఉన్న దొరల గోరీలను పరిరక్షించాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి. సంపత్‌కుమార్ కోరారు. మంగళవారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల వెడల్పులో భాగంగా దొరల గోరీలను తొలగించే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. ఈ సమాధులకు 217 సంవత్సరాల చరిత్ర ఉందని, బ్రిటీషు కలెక్టర్లు, అధికారులు, క్రైస్తవుల సమాధులు ఇక్కడ ఉన్నాయన్నారు. ఇప్పటికీ ఇంగ్లాండ్ తదితర దేశాల నుంచి వారి కుటుంబీకులు సందర్శించి వెళ్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్టియన్ నాయకులు సీహెచ్ సునీల్ కుమార్, శ్యాంసన్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కడప కార్పొరేషన్: కడప నగరం పాలెం పాపయ్య వీధిలో మెకానిక్ వద్ద పనిచేసే ఓ యువకునికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఈ విషయం తెలుసుకున్న ది కడప ప్రైవేటు టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం ఆ యువకునికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నగర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షుడు పి. ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ సిబ్బంది నిరసన



మాట్లాడుతున్న ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కడప కల్చరల్ : పెండింగ్ సమస్యలపై మంగళవారం కడప నగరానికి చెందిన ఎల్‌ఐసీ సిబ్బంది తమ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. బ్యాంకులు, ఇతర సంస్థల్లోలాగా 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ చెల్లించాలని, కొత్త పెన్షన్ స్కీమ్‌లో 14 శాతం యాజమాన్య వాటా చెల్లించాలని, వేతన సవరణ చర్చలు తక్షణమే ప్రారంభించాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రపాల్, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి సుధీకర్ డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘాల దేశ వ్యాప్త సంయుక్త కార్యాచరణ పిలుపు మేరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ల నేతలు యల్లారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పద్మజ, అక్బర్, రాజు, వారిజాతమ్మ, పర్వీన్, కుమార్, శ్రీకృష్ణ, వసుప్రద, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విశేష అలంకారంలో శ్రీలక్ష్మి సత్యనారాయణస్వామి

కడప కల్చరల్ : కడప శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఇదేరోజున పౌర్ణమి కలిసి రావడంతో ఈ రెండు పూజల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. తొలుత పౌర్ణమి పూజల్లో భాగంగా అమ్మవారి మూల విరాట్‌కు పుణ్య నదీ జలాలు నింపిన 18 కళాశాల నీటితో ప్రదక్షిణల అనంతరం విశేష అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో పలువురు భక్తులు తమ కుటుంబాలతో కలిసి చండీహోమంలో పాల్గొన్నారు. 108 మంది ముత్తయిదువులు 108 దీపాలను వెలిగించి అష్టోత్తర శత దీపాలంకార సేవ నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలను నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ చేపట్టారు.

– కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ భట్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధిక శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని విశేష సంఖ్యలో హాజరైన భక్తులతో ఈ వ్రతాన్ని సామూహికంగా ఆచరింపజేశారు. తొలుత మహాసంకల్పం, నవకలశ స్నపన తిరుమంజనం, తోమాల సేవ, సహస్ర నామార్చన తదితర పూజలనంతరం వ్రతం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో పుష్పగిరి ప్రదక్షిణ

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో అధిక శ్రావణ మాస పూర్ణిమను పురస్కరించుకుని మంగళవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలివచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ చెన్నకేశవ, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. భగవద్గీత ఉపన్యాసకులు రాధా మనోహర్ దాస్ భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సనాతన హిందూ సాంప్రదాయాలను గురించి, ధర్మం గురించి వివరించారు. కొందరు దాతలు భక్తులకు అల్పాహారం, మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.



గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో భాగంగా పూజలు చేస్తున్న భక్తులు



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

బిషప్ ఫిలిప్ కన్నుమూత

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం బిషప్ డాక్టర్ బీటీ ఫిలిప్ మంగళవారం కన్నుమూశారు. ఇటీవల కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం కన్నుమూశారు. ప్రార్థనా మందిరంలోనే తుదిశ్వాస వదిలారు. ఆయన శిష్యులు, చర్చి కమిటీ సభ్యులు, విశ్వాసులు విశేష సంఖ్యలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

రామాయణం మార్గదర్శక గ్రంథం

కడప కల్చరల్ : మానవుల మధ్య అనుబంధాలకు గౌరవాన్ని ఇనుమడింపజేసిన గ్రంథం రామాయణమని డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచార పరిషత్ కడపశాఖ పర్యవేక్షణలో మంగళవారం స్థానిక ఎర్రముక్కపల్లెలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. వాల్మీకి రామాయణం విశిష్టత అనే అంశంపై ప్రసంగించారు. రామాయణం సర్వకాలాలకు మార్గదర్శక గ్రంథమన్నారు. రామాయణం, అందులోని మానవతా విలువలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివరామశర్మ, ధర్మకర్త నాగిరెడ్డి, బయపురెడ్డి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ ఇ.డిల్లీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాలకు అడ్డుకట్ట



డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని కడప ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విధుల్లోకి వచ్చే ప్రతి డ్రైవర్ నిరంతరం జాగురూకతతో వ్యవహరించాలన్నారు. బస్సు నడిపే సమయంలో తమతోపాటు ప్రయాణీకుల భద్రత గురించి ఆలోచించాలన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరగడం బాధాకరమన్నారు. ఆర్టీసీ సంస్థకు ప్రమాద రహిత సంస్థగా గుర్తింపు ఉందని, ఇందుకు డ్రైవర్ల కృషి కూడా ఎంతో ఉందన్నారు. డ్రైవర్లు సురక్షితమైన డ్రైవింగ్ చేసి అధికారులతోపాటు సంస్థకు గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం ఆర్టీసీ అధికారులు డ్రైవర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్నారుల తల్లులు తల్లిపాల ప్రాధాన్యత గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీడీఎస్ కడప సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ రెడ్డెమ్మలు తెలిపారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కడప నగరంలోని పలు అంగన్వాడీ కేంద్రాలో తల్లులు, గర్భవతులకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేశారు. చాలామంది తల్లులు తమ బిడ్డలకు పాలు పట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. తల్లిపాలు చిన్నారులకు అమృతంలో సమానంగా భావించాలన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రు పాలు తాపితే చిన్నారి ఆరోగ్యానికి అవి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రతి తల్లి చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బిడ్డకు పాలను ఇవ్వడం మరిచిపోరాదన్నారు. అనంతరం తల్లులు, గర్భవతుల సమస్యలకు ఐసీడీఎస్ అధికారులు సమాధానాలు ఇచ్చారు.

ఇద్దరు మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం నకాష్ సమీపంలో మట్కా రాస్తున్న సయ్యద్ బాష, అబ్దుల్ ఖాదర్ అనే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జయరాముడు తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ. 21,450 నగదుతో పాటు, మట్కా స్లిప్‌లను సీజ్ చేశారు.

జెడ్పీలో రూముల వేలం పాట

కడప ఎడ్యుకేషన్: మైదుకూరులోని కడప జిల్లా పరిషత్తుకు సంబంధించిన రూముల వేలం పాట మంగళవారం జెడ్పీలో ప్రశాంతంగా జరిగింది. జెడ్పీ ఆవరణంలోని డీపీఆర్‌సీ భవనంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో మైదుకూరుకు చెందిన వెంకటసుబ్బయ్య, మస్తాన్, చంద్రాయుడు, లక్ష్మినరహరి, కరీముల్లా, సురేష్‌లు పాల్గొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొన్న ఈ 6 మంది అభ్యర్థులు ఒకొక్కరు రూ 5. వేలు డీడీని చెల్లించి పాటలో పాల్గొన్నారు. ఈ వేలం పాటలో రూములు దక్కించుకున్న వారి నుంచి ఒకొక్కరి దగ్గర రూ.2 లక్షలు డిపాజిట్‌ను కట్టించుకుని వారికి మూడు సంవత్సరాల పాటు అగ్రిమెంట్‌ను ఇవ్వనున్నారు. వేలం పాటలో రూములు దక్కించుకోని మిగతా ముగ్గురు వ్యక్తులు కట్టిన డీడీని జెడ్పీ అధికారులు తిరిగి వెనక్కు ఇచ్చారు.

ఓటర్ల జాబితా సర్వే పక్కాగా చేపట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో డోర్ టు డోర్ జరిగే ఓటర్ల జాబితా నిష్పక్షపాతంగా ఉండాలని, ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చూడాలని తహసీల్దార్ శివరామిరెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి కడప తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఓటర్ల జాబితాపై సూపర్‌వైజర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఇంటింటికి తిరిగే సమయంలో ఓటర్ల గురించి క్షుణ్ణంగా తెలుసుకుని జాబితా సరి చేసుకోవాలన్నారు. 280 మంది బీఎల్‌ఓల చేత సర్వే చేయించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఓటర్ల జాబితా పక్కాగా ఉండేలా చూడాలని కోరారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కడప అర్బన్: కడప నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో షేక్ ఖాజావల్లీ (45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కడప వన్ టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్లకు చెందిన ఖాజావల్లీ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఓ టైలర్ షాపులో పనిచేస్తుండేవాడు. ఖాజావల్లీ తాను పనిచేస్తున్న టైలర్ షాపులోనే ఉండేవాడు. సోమవారం రాత్రి అక్కడే పడుకున్న అతను తెల్లారేసరికి మృతి చెందాడు. టైలర్ షాపు ఓనర్ అన్వర్ హాఖ్ కుటుంబసభ్యులు షాపు తెరిచి చూసి అతడు మృతి చెందిన విషయాన్ని గమనించారు. సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. అతను అనారోగ్య సమస్యలతో మృతి చెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే విషయం పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తెలియాల్సి వుంది. మృతుని సోదరి షేక్ రహమత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్ టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలియజేశారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న నిరసనలు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన కార్యక్రమం మంగళవారం నాటికి నాల్గవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆర్టీపీపీలోని పరిపాలన విభాగం కార్యాలయం వద్ద భారీగా నిరసన కార్యక్రమం చేపట్టారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారంపై ఏపీజెన్‌కో యాజమాన్యం స్పందించాలేదన్నారు.

మణిపూర్ దారుణ ఘటన ఉన్మాద చర్య



నిరసన తెలుపుతున్న విద్యార్థులు జేవీవీ సమత విభాగం ప్రతినిధులు

కడప కల్చరల్ : మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న మారణహోమం ఉన్మాద చర్య అని జన విజ్ఞాన వేదిక మహిళా విభాగం సమత విభాగం అధ్యక్షులు కామేశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూడు నెలలుగా జరుగుతున్న ఈ మారణహోమంలో వంద మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా 300 మందికి పైగా తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతుండడం బాధాకరమన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని విమర్శించారు. ప్రధాని మోదీ సకాలంలో స్పందించి ఉన్మాద చర్యను అదుపుచేయడంలో విఫలమయ్యారని తెలిపారు. సమత విభాగం ప్రతినిధి సరస్వతి, జేవీవీ సమత ప్రతినిధి సునీత, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ మణిపూర్ పరిణామాలన్నింటినీ తీవ్రంగా ఖండిస్తున్నామని, అక్కడ వెంటనే శాంతిభద్రతలు కాపాడేలా కేంద్రం సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శివరామ్, కిరణ్ కుమార్, వైద్యులు, ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు షామీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితులలో పంటలు దెబ్బతిని దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చక్రాయపేట మండలం మహదేవపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మహదేవపల్లె, గంగారపువాండ్లపల్లె గ్రామ ప్రజలు వారి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019–20 సంవత్సరంలో మామిడి తోటల్లో పిందె, పూత రాలిపోయి నష్టపోయిన 1500 మంది రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులు వేసిన పంటలకు ప్రభుత్వం ఉచితంగా బీమాను చెల్లిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. మహదేవపల్లెలో రూ.1.15 కోట్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్, పాడా నిధులతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గండి క్షేత్రంలో గోశాలకు ముఖ ద్వారం, కాంపౌండ్ వాల్, షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ పి.రాఘవేంద్రప్రసాద్‌లు ఎంపీని కోరారు. ముందుగా గోశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన 4 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, టూరిజం శాఖ డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ నరేంద్ర, ఏడీఈ శ్రీకాంత్, సర్పంచ్‌లు శివారెడ్డి, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

విద్యార్థుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

వల్లూరు : పాఠశాలల్లో విద్యార్థుల రక్షణపై ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం వుందని జిల్లా విద్యా శాఖాధికారి వై.రాఘవరెడ్డి తెలిపారు. మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల పాఠశాలల భద్రత కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కమిటీ మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యార్థుల రక్షణ గురించి అవగాహన కల్పించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టేలా చూడాలని అన్నారు. ఎంపీడీవో జుబేద మాట్లాడుతూ మండల కమిటీ ఆధ్వర్యంలో అందరం సమన్వయంతో పనిచేసి విద్యార్థుల రక్షణకు కృషి చేద్దామన్నారు. విద్యార్థులను అనవసర విషయాల్లో బయటికి పంపరాదన్నారు. నీటి కుంటలు, విద్యుత్ ప్రమాదాలను గురించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డిఈవోను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సేఫ్టీ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఎంఈవో లిల్లెమ్మ, ఎంఈవో 2 విజయ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి

ముంపు వాసులకు త్వరలోనే నష్టపరిహారం

సింహాద్రిపురం : మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్ ముంపు వాసులకు త్వరలోనే నష్టపరిహారం అందుతుందని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పైడిపాలెం గ్రామంలో ఇంకా కొంతమందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సాంకేతిక లోపాలతో అందని కొందరి లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా డబ్బులు అర్హులైనవారికి అందుతాయని.. అలాగే ప్రాజెక్టు కింద జోకులెత్తుతున్న భూముల రైతుల పొలాలను అధికారులు పరిశీలించి నివేదికలు అందిస్తారన్నారు. నివేదికలు అందిన వెంటనే నష్టపరిహారం అందేటట్లు చూస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నచెప్పలి సచివాలయ పరిధిలోని చిన్నరెడ్డిపల్లె, బయనపల్లె గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులను సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే పరిష్కరించారు. 30 ఏళ్లుగా పరిష్కారంకాని చిన్నరెడ్డిపల్లె వద్ద ఉన్న గాడిదల వంక సమస్య పరిష్కారమైంది. గత గడప గడపకు కార్యక్రమంలో గ్రామానికి చెందిన అబ్దుల్ సత్తార్ గాడిదల వంక పూడిపోయిందని, పూడిక తొలగిస్తే ఈ గాడిదల వంక నీరంతా చదిపిరాళ్ల, కమలాపురం చెరువులకు వెళ్లే కట్టుకొమ్మ కాలువలో కలుస్తుందని అలాగే అలిదెన ఓబాయపల్లె నుంచి ఈ కాలువ వస్తుందని, వర్షాలు, వరదల నీరంతా ఈ కాలువలో పారుతుందని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ పీఆర్‌లకు ఈ వంకలో పూడికను తొలగించి కట్టుకొమ్మ కాలువకు కలపాలని ఆదేశించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాదు ప్రపంచంలోనే గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష.. కార్యక్రమాలు ఏ పార్టీ నిర్వహించలేదన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు ఉండకూడదన్నదే సీఎం ఆశయం అన్నారు. 30 ఏళ్ల వంక సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చిన్నచెప్పలి గ్రామంలో రూ.30 లక్షల డీఎంఎఫ్ నిధులతో నూతనంగా నిర్మించిన మంచి నీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, బుజ్జన్న, పుల్లారెడ్డి, నాగేంద్రరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, కొండారెడ్డి, గంగాధర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గఫార్, గండి భాస్కర్, నిఖిల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, అయ్యావార్ యాదవ్, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి